క్లుప్తంగా

అర్చకులకు సన్మానం



ఆత్మకూర్: మండలంలోని పిన్నంచర్లలో మన ఊరు, మన గుడి, మన అర్చకుడు కార్యక్రమంలో భాగంగా మంగళవారం అర్చకులను ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా ధూప దీప నైవేద్య అర్చక సంఘం జిల్లా అధ్యక్షుడు లక్ష్మీకాంతాచార్యులు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఆలయాలను సందర్శిస్తూ అర్చకుల సమస్యలను తెలుసుకోవడంతో పాటు అక్టోబర్ ఒకటవ తేదీ నుంచి మూడో తేదీ వరకు జిల్లాకేంద్రంలో శిక్షణ నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో నటరాజ్, బాల్‌లింగయ్య, వెంకటయ్య, వెంకోబా, శ్రీధర్‌ఆచారి, భీమ్‌సేన్‌రావ్, రవికుమార్, శ్రీహరి, సర్పంచ్ విజయలక్ష్మి తదితరులు ఉన్నారు.

హైమాస్ట్ లైట్లు ప్రారంభం



చిన్నంబావి: మండలంలోని లక్ష్మీపల్లిలో ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి సహకరంతో రూ.5లక్షలతో నిర్మించిన హైమాస్ట్ లైట్లను సర్పంచ్ లక్ష్మి ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామల అభివృద్ధి కోసం ప్రత్యేక శ్రద్ధతో నిధులు మంజూరు చేసి గ్రామ అభివృద్ధికి పాటు పడుతున్న ఎమ్మెల్యేకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో శ్రీధర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, ఇటిక్యాల మహేష్, పరమేష్, మహేష్ యాదవ్, చాంద్‌పాష, మోహన్ బాబు, నరహరి, సంపంగి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు వైద్య పరీక్షలు



ఆత్మకూర్: మున్సిపాలిటీలో పనిచేస్తున్న కార్మికుల ఆరోగ్యాన్ని పరిరక్షించేందుకు ప్రతివారం వైద్య పరీక్షలు చేయిస్తున్నామని చైర్‌పర్సన్ గాయత్రి, వైస్ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, కమిషనర్ నాగరాజు అన్నారు. మంగళవారం స్థానిక మున్సిపాలిటీ కార్యాలయంలో తిప్పుడంపల్లి పీహెచ్‌సీ వైద్యుల ఆధ్వర్యంలో కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో రవికుమార్, వైద్యులు వసంత, నవీన, సూపర్‌వైజర్ సామ్రాజ్యలక్ష్మి, ఏఎన్‌ఎంలు నాగలక్ష్మి, రాజమని, ఇందిర, షాహీన్ తదితరులు ఉన్నారు.

ఆంజనేయస్వామి ఆలయంలో సప్తాహం



పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండల కేంద్రంలోని అభయ ఆంజనేయస్వామి ఆలయంలో మంగళవారం సప్తాహ కార్యక్రమం నిర్వహించారు. సోమవారం ఉదయం నుంచి మారుతి భజన మండలి ఆధ్వర్యంలో మంగళవారం వరకు అఖండ భజన చేశారు. ఆలయ అర్చకులు స్వామివారికి పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు అన్నదానం చేశారు.

పాఠశాల ఆవరణలో మద్యం సీసాలు



పెబ్బేరు రూరల్: మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో గుర్తు తెలియని వ్యక్తులు మద్యం తాగుతూ సీసాలను మైదానంలో పడేస్తున్నారు. కొందరు ఆకతాయిలు ఖాళీ సీసాలను పగలగొట్టడంతో మైదానంలో గాజు పెంకులు ఉంటున్నాయని ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉదయం పాఠశాలకు వచ్చిన విద్యార్థులకు గాజు పెంకులు గుచ్చుకొని గాయాలు అయ్యే ప్రమాదం ఉందన్నారు. ఇలాంటి ఘటనలు మళ్లీ పునరావృతం కాకుండా చూడాలని, పాఠశాలలో మద్యం సేవించిన వారిపై చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు పోలీసులను కోరారు.

గాయపడిన నెమలి పోలీసులకు అప్పగింత

కొత్తకోట రూరల్: మండలంలోని పాలెం బ్రిడ్జి సమీపంలో నెమలిపై కుక్కలు దాడి చేస్తుండగా గమనించిన బాటసారులు వాటిని తరిమి నెమలిని హెడ్ కానిస్టేబుల్ కుర్మయ్యగౌడ్‌కు అప్పగించారు. ఎస్‌ఐ మంజునాథ్‌రెడ్డి ఆదేశానుసారం హెడ్‌కానిస్టేబుల్ కుర్మయ్యగౌడ్ వెంటనే జిల్లా ఫారెస్ట్ అధికారులకు సమాచారం అందించారు. గాయపడిన నెమలిని పశువైద్యాధికారితో వైద్యపరీక్షలు చేయించి ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ ప్రశాంత్‌రెడ్డికి అప్పగించారు. పాలెం బ్రిడ్జి సమీపంలో కొంత కాలంగా నెమళ్లు సంచరిస్తున్నట్లు స్థానికులు తెలిపారు.

అభివృద్ధి ప్రదాత సీఎం కేసీఆర్

- ప్రజా, రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం
- ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి



పాన్‌గల్‌లో తహసీల్దార్, ఏడీఏ కార్యాలయాల నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి

పాన్‌గల్: సీఎం కేసీఆర్ ఆలోచన విధానాలు, అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమంతో రాష్ట్రం దేశానికి ఆదర్శంగా నిలుస్తుందని కొల్లాపూర్ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంతో పాటు బహుదూర్‌గూడెం, అన్నారం గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రి సింగిరెడ్డి సహకారంతో మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశామన్నారు. పార్టీలకతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందించడమే ప్రభుత్వ లక్ష్య అని తెలిపారు. మండలంలో ప్రతి ఎకరాకు సాగునీరు అందిస్తామన్నారు. రైతు రుణమాఫీ, రైతు బంధు, రైతు బీమా, ఉచిత విద్యుత్, పండించిన పంటలకు గిట్టుబాటు ధర వంటి పథకాలతో అన్నదాతకు భరోసా ఏర్పడిందన్నారు. మండలంలోని కిష్టాపూర్ సమీపంలో నిర్మించే రామన్నగట్టు రిజర్వాయర్ నిర్మాణం పనులకు త్వరలో ప్రభుత్వ అనుమతులు లభిస్తాయని, దీంతో ప్రతి గ్రామానికి సాగునీరు అందుతుందన్నారు. అన్ని వర్గాలకు మంచి చేసే ప్రభుత్వాన్ని మరోసారి ప్రజలు ఆశీర్వదించాలని కోరారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకుంటుందని ఆరోపించారు.

శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు

మండలంలోని బహుదూర్‌గూడెం గ్రామానికి రూ.80 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును, మండల కేంద్రంలో రూ.15 లక్షలతో నిర్మించిన యాదవ కమ్యూనిటీ భవనానికి, రూ.2.5లక్షలో ఏర్పాటు చేసిన హైమాస్టు లైట్లను ఆయన ప్రారంభించారు. మండల కేంద్రంలో రూ.1.75 కోట్లతో నిర్మించే నూతన తహసీల్దార్ కార్యాలయం, రూ. 35 లక్షల నిధులతో ఏడీఏ కార్యాలయం భవన నిర్మాణానికి, అన్నారం నుంచి దొండాయిపల్లి గ్రామానికి రూ.2.50 కోట్లతో నిర్మించే బీటీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశారు.

కల్యాణలక్ష్మి పథకం కొనసాగుతుంది

బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నంత వరకు పేదింటి ఆడ పిల్లలకు అందించే కల్యాణలక్ష్మి పథకం కొనసాగుతుందని ఎమ్మెల్యే అన్నారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 70 మంది మహిళలకు మంజూరైన కల్యాణ లక్ష్మి చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ మామిళ్లపల్లి శ్రీధర్ రెడ్డి, జెడ్పీటీసీ లక్ష్మి, మార్కెట్ కమిటీ చైర్మన్ కిషన్ నాయక్, వైస్ చైర్మన్ సోమ్‌నాథ్‌నాయక్, వెంకటయ్యనాయుడు, సింగిల్ విండో వైస్ చైర్మన్ కుర్వ బాలయ్య, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాము యాదవ్, చంద్రశేఖర్‌నాయక్, జ్యోతినందన్‌రెడ్డి, కాంట్రాక్టర్ సాయిసాగర్ తదితరులు పాల్గొన్నారు.

వీపనగండ్ల: గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనతో సత్వర అభివృద్ధి సాధ్యమని కొల్లాపూర్ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని గోవర్ధిన్నెలో పలు అభివృద్ధి పనులకు ఆయన భూమిపూజ చేసి మాట్లాడారు. గత పాలకులు నియోజకవర్గాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేయడంతో అభివృద్ధిలో వెనుకబడిందని.. ముఖ్యమంత్రి కేసీఆర్ సహకారంతో అభివృద్ధి పథంలోకి తీసుకొచ్చామని తెలిపారు. సాగు, తాగునీరు, విద్య, వైద్యరంగాల్లో గ్రామాలు పురోగతి సాధించాయని.. రాబోయే ఎన్నికల్లో మరోమారు ప్రజలు బీఆర్ఎస్ పార్టీని గెలిపించాలని కోరారు. గ్రామంలో రూ.20 లక్షలతో గ్రామపంచాయతీ కార్యాలయ భవనం, రూ.10 లక్షలతో కమ్యూనిటీ భవన నిర్మాణానికి భూమిపూజ చేశారు. అలాగే రూ.2 లక్షలతో ఏర్పాటుచేసిన హైమాస్ట్ లైట్లను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ కమలేశ్వర్‌రావు, సర్పంచ్‌లు ఉదయ్‌కుమార్, రఘునాథ్‌రెడ్డి, రామేశ్వర్‌రావు, మండలపార్టీ అధ్యక్షుడు సత్యనారాయణగౌడ్, పార్టీ సీనియర్ నాయకులు ఎద్దుల సురేందర్‌రెడ్డి, కురుమయ్య, రఘురెడ్డి, కరుణాకర్‌రెడ్డి, ఎంపీడీఓ కతలప్ప, ఎంపీఓ బద్రీనాథ్ పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల సమ్మె



దీక్ష చేస్తున్న కార్మికులు

పెబ్బేరు రూరల్: వనపర్తి జిల్లా కేంద్రంలోని మర్రికుంట ధర్నా చౌక్ వద్ద మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో పంచాయతీ కార్మికులు సమ్మె చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మండ్ల రాజు మాట్లాడుతూ పంచాయతీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. గతంలో కార్మికులు 34 రోజులు సమ్మె చేయగా.. వారి సమస్యలను ప్రభుత్వం పరిష్కరిస్తామని చెప్పడంతో సమ్మెను విరమించారని గుర్తు చేశారు. కానీ వారి డిమాండ్లలో కొన్ని మాత్రమే పరిష్కరిస్తామని చెప్పడంతో మళ్లీ తిరిగి సమ్మె ప్రారంభించారు. జీఓ 60 ప్రకారం రూ.15,600, 19,500ల చొప్పున రెండు కేటగిరీల జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం మాట తప్పడం సరైన పద్ధతి కాదన్నారు. కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఆర్యన్ రమేష్, కురుమయ్య, హనుమంత్‌నాయక్, నందిమల్ల రాములు, కార్మికులు పుష్ప, సుగ్రీవుడుదాస్, హనీఫ్, చంద్రశేఖర్, శ్రీను, శివ, కురుమయ్య, రాజ్‌కుమార్, నరేష్, తిరుపతయ్య, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌బీఐ ప్రమాద బీమా చెక్కు అందజేత



పాన్‌గల్: ప్రతి ఒక్కరూ బీమా చేసుకోవడంతో కుటుంబాలకు ఎంతో మేలు జరుగుతుందని ఎస్‌బీఐ ఏజీఎం వెంకట్‌నారాయణ అన్నారు. మండల కేంద్రంలోని ఎస్‌బీఐ బ్యాంకులో బీమా చేసిన కొత్తపేటకు చెందిన బత్తిని నాగరాజు ఇటీవల ప్రమాదవశాత్తు మృతి చెందాడు. దీంతో బాధితుడి కుటుంబానికి వ్యక్తిగత ప్రమాద బీమా ద్వారా రూ.10 లక్షల చెక్కును మృతుడి భార్య శాంతమ్మకు మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో సీఎస్‌ఎం వెంకట్‌లక్ష్మణ్, బ్యాంకు మేనేజర్ నాగరాజు, వనపర్తి చీఫ్ మేనేజర్ నాగప్రకాష్, ఏరియా మేనేజర్ భరత్‌కుమార్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మిలాద్‌నబీ గంధోత్సవం

అమరచింత: మిలాద్‌నబీ పర్వదినాన్ని పురస్కరించుకొని పట్టణంలో మంగళవారం మిలాద్‌నబీ గంధోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక చండూల్ బీడీ ఫ్యాక్టరీ సమీపంలో ఉన్న మౌలాలీ మసీదు నుంచి నబీ రసూల్ అల్లా గంధోత్సవాన్ని పట్టణ పుర వీధుల గుండా తీసుకొచ్చి మసీదుకు చేర్చారు. బుధవారం ఉర్సు, గురువారం ఆసర్ ముబారక్‌తో మహ్మద్ ప్రవక్తకు చెందిన మీసాలను భక్తుల సందర్శనార్థం ఉంచుతున్నట్లు నిర్వాహకులు తెలిపారు.



భక్తిశ్రద్ధలతో వినాయక నిమజ్జనం



అమరచింత జగన్‌వాడలో..



మున్ననూర్‌లో విరాళం అందిస్తున్న దీరుమల్



ఆత్మకూర్‌లో..

ఆత్మకూర్: భక్తిపారవశ్యంతో గణనాథుడి నిమజ్జనాన్ని మంగళవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. స్థానిక వాసవీకన్యకా పరమేశ్వరిమాత ఆలయంలో, నేతాజీనగర్‌లోని ఆంజనేయస్వామి ఆలయంలో ప్రతిష్ఠించిన గణపయ్యలను నిమజ్జనానికి తరలించారు. బీసీకాలనీలో మంజుల, కరుణాకర్ దంపతుల ఆధ్వర్యంలో, శివాజీనగర్‌లో దివంగత హోటల్ శేషయ్య కుమారుల ఆధ్వర్యంలో వినాయక మండపాల వద్ద భక్తులకు అన్నదానం చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గాయత్రి, వైస్‌చైర్మన్, విజయభాస్కర్‌రెడ్డి, రవికుమార్, గడ్డమీది శ్రీనివాస్, కౌన్సిలర్లు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అమరచింత: పట్టణంలోని ఆయా వార్డుల్లో కొలువుదీరిన గణనాథుల వద్ద ప్రత్యేక పూజ కార్యక్రమాలను నిర్వహించి అన్నదానం చేశారు. సుభాష్‌నగర్ వినాయక మండపం వద్ద బీజేపీ పట్టణ కార్యదర్శి దుబాయి వెంకటేశ్వర్‌రెడ్డి దంపతులు, గణేష్‌నగర్, గాంధీనగర్, రాణాప్రతాప్ నగర్, సంతోష్ నగర్, రాంనగర్ వినాయక మండపాల్లో అన్నదానం నిర్వహించారు.

పట్టణంలో..

పట్టణంలో పది వార్డుల్లో కొలువుదీరిన గణనాథులను ప్రత్యేక అలంకరణలతో పట్టణ పురవీధుల గుండా ఊరేగించి నిమజ్జనానికి తరలించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా ఎస్‌ఐ జగన్మోహన్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

గోపాల్‌పేట: మండలంలోని బుద్దారం కొత్తకాలనీ ప్రతిష్ఠించిన గణనాథుడి వద్ద గ్రామ ముస్లిం కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో రషీద్, గఫార్, నసీర్, గౌస్, ఉస్మాన్, అన్వర్, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

విరాళం అందజేత

మండలంలోని మున్ననూరులో మాజీ మంత్రి చిన్నారెడ్డి అనుచరుడు దీరుమల్ యాదవ్ వినాయక మండపాల నిర్వహణకు రూ.1.2లక్షలు విరాళంగా అందించారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి ప్రవీణ్‌కుమార్, గ్రామ అధ్యక్షుడు తిరుమల యాదవ్, కావలి రాములు, గోవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెబ్బేరు రూరల్: వనపర్తి మండలంలోని సవాయిగుడెంతండాలో ప్రతిష్ఠించిన వినాయకుడికి మంగళవారం వనపర్తి నియోజకవర్గ ఎన్నికల సమన్వయకర్త వంగూర్ ప్రమోద్‌కుమార్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ డేగ మహేశ్వర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మాణిక్యం స్థానిక నాయకులతో కలిసి పూజలు చేశారు. అనంతరం వారిని శాలువా, పూలమాలతో ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో సన్మానించారు.

పరిసరాల శుభ్రత అందరి బాధ్యత



ఆత్మకూర్‌లో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ గాయత్రి

ఆత్మకూర్: పర్యావరణాన్ని కాపాడుకునేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని పుర చైర్‌పర్సన్ గాయత్రి, వైస్‌చైర్మన్ విజయభాస్కర్ రెడ్డి, కమిషనర్ నాగరాజు అన్నారు. ఇండియన్ స్వచ్ఛత లీగ్ 2.0 కార్యక్రమంలో భాగంగా మంగళవారం పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో స్వచ్ఛత హై సేవా, వేస్ట్ టూ వండర్ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పర్యావరణం, స్వచ్ఛతపై ఉపన్యాస, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ప్లాస్టిక్, వ్యర్థాలు, నష్టాల గురించి అవగాహన కల్పించారు. అనంతరం ప్లాస్టిక్ నివారణ, పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. అత్యంత ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులను అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రవికుమార్, కౌన్సిలర్ తబస్సూంమోసీన్ ఉన్నారు.

అమరచింత: స్వచ్ఛత కార్యక్రమాలను నిర్వహించి ఆరోగ్యకర సమాజం నిర్మించే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ, కమిషనర్ మహమ్మద్‌ఖాజా అన్నారు. స్వచ్ఛతహి సేవ కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులకు స్వచ్ఛత వల్ల కలిగే ప్రయోజనాలపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం పట్టణాల్లో స్వచ్ఛత పాటించేందుకు ఎన్నో కార్యక్రమాలను నిర్వహిస్తుందన్నారు. మున్సిపల్ కార్మికులు ప్రతినిత్యం ఇంటింటి నుంచి చెత్తను సేకరించడం, వాటిని డంపింగ్ యార్డులకు తరలించడం వంటి కార్యక్రమాలతో పాటు నిత్యం పరిసరాల పరిశుభ్రత కోసం పనిచేస్తున్నారని కొనియాడారు. ప్రజలు పరిసరాల శుభ్రత కోసం తమ వంతు సహకారం అందించాలని, ఎక్కడ పడితే అక్కడ చెత్త వేయకుండా మున్సిపాలిటీ ట్రాక్టర్లకు అందించాలని కోరారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎం కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

సేవ సామాజిక బాధ్యత



ఆత్మకూర్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ 2 ఆధ్వర్యంలో మంగళవారం స్వచ్ఛ్‌భారత్‌లో భాగంగా పారిశుద్ధ్య, సేవా కార్యక్రమాలను ముమ్మరంగా నిర్వహించారు. సామాజిక సేవ ప్రతి ఒక్కరి బాధ్యత అని, విద్యార్థులు సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని ప్రిన్సిపాల్ డాక్టర్ మెర్సి వసంత, వైస్ ప్రిన్సిపాల్ రాధిక అన్నారు. ఈసందర్భంగా కళాశాల పరిసరాల్లో పేరుకుపోయిన చెత్తా చెదారం, ముళ్లపొదలను తొలగించారు. కార్యక్రమంలో అధ్యాపకులు షకీల్‌అహ్మద్, చక్రపాణిరెడ్డి, శ్రీనివాసులు, గోపాల్, వెంకటేశ్వర్‌రెడ్డి, లత, గిరిధర్, సహదేవ్, సురేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

సామాజిక తనిఖీ పక్కాగా ఉండాలి

ఖిల్లాఘనపురం: మండలంలో నిర్వహించే ఉపాధి హామీ పనుల సామాజిక తనిఖీ పక్కాగా ఉండాలని అంబుడ్స్‌మెంట్ అధికారి సత్యనారాయణరెడ్డి తెలిపారు. మండలంలో 13వ ఉపాధిహామీ సామాజిక తనిఖీ సమన్వయ సమావేశం మంగళవారం ఎంపీడీఓ కార్యాలయం వద్ద నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడుతు మండలంలో మార్చి 2022 నుంచి ఆగస్టు 2023 వరకు చేపట్టిన పనులపై సామాజిక తనిఖీ ఉంటుందన్నారు. కార్యక్రమంలో డీఆర్పీ, సీఆర్పీ, ఏపీఓ సత్యనారాయణ, ఎంపీఓ రాజు పాల్గొన్నారు.

పారితోషికం లేని పనులు చేయించకూడదు

పెబ్బేరు రూరల్: పారితోషికం లేని అదనపు పనులు ఆశావర్కర్లతో చేయించకూడదని సీఐటీయూ జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు అన్నారు. సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం వనపర్తి జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయం సమీపంలో ఆశాలు రిలే దీక్షలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఆశావర్కర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. డబ్ల్యూహెచ్‌ఓ హెల్త్‌గ్లోబల్ రీడర్స్ అని ఆశా వర్కర్లకు అవార్డును ప్రకటించిదన్నారు. పేదలకు సేవలందిస్తున్న వారికి నేటికీ ప్రభుత్వం నుంచి ప్రోత్సాహకం అందక అన్యాయనికి గురవుతున్నారని వాపోయారు. గతంతో పోలిస్తే ఈ కాలంలో ఆశాలకు పని భారం పెరిగిందన్నారు. పారితోషకం లేని అనేక పనులను ప్రభుత్వం వారితో చేయిస్తుందని ఆరోపించారు. వారికి కనీసం రూ.18 వేలకు వేతనం నిర్ణయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మండ్ల రాజు, బొబ్బిలి నిక్సన్, గోపాలకృష్ణ, తెలంగాణ ఆశవర్కర్స్ యూనియన్ అధ్యక్షురాలు బుచ్చమ్మ, కార్యదర్శి సునీత, చిట్టెమ్మ, అలివేల, భాగ్య, అనసూయ, చిట్టెమ్మ, పుష్ప, నీలమ్మ, సంధ్య, మంజుల, శ్యామల, రాధ, లక్ష్మీదేవి, అరుణ, లావణ్య, సుజాత తదితరులు పాల్గొన్నారు.

డప్పుకళాకారుల కమిటీ ఏర్పాటు



ఖిల్లాఘనపురం: మండలంలోని పలు గ్రామాల్లో డప్పు కళాకారుల నూతన కమిటీలను మంగళవారం రాష్ట్ర డప్పు కళాకారుల సంఘం అధ్యక్షుడు మైబు ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. మానాజీపేట గ్రామ కమిటీ గౌరవ అధ్యక్షుడిగా చిన్నవెంకటయ్య, అధ్యక్షుడిగా గాజులపేట వెంకటయ్య, ఉపాధ్యక్షులు గడ్డం కొండన్న, ప్రధాన కార్యదర్శి వెంకటయ్య, సహాయ కార్యదర్శి చంద్రయ్య, కోశాధికారిగా అంజనేయులు, సలహాదారులుగా ఎల్లస్వామిని ఎంపిక చేశారు. మల్కిమియాన్‌పల్లిలో అధ్యక్షుడిగా అర్జున్, ఉపాధ్యక్షులుగా వెంకటయ్య, ప్రధాన కార్యదర్శిగా రామకృష్ణ, సహాయ కార్యదర్శిగా చెన్నయ్య, సలహాదారుగా కుర్మయ్యను ఎన్నుకున్నారు. నూతనంగా ఎంపికైన కమిటీ సభ్యులను జిల్లా కమిటీ ఉపాధ్యక్షులు కొండన్న, మండల నాయకులు కుర్మయ్య, మన్నెం తదితరులు అభినందించారు.

అంగన్‌వాడీ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి



వీపనగండ్లలో అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రాన్ని అందజేస్తున్న అంగన్‌వాడీలు

సాక్షి, నెట్‌వర్క్: అంగన్‌వాడీ టీచర్ల సమస్యలను పరిష్కరించాలంటూ జిల్లా వ్యాప్తంగా చేస్తున్న సమ్మె మంగళవారం 16వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్లు తమ సమస్యలను పరిష్కరించాలని అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు అంగన్‌వాడీలు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా పని చేస్తున్న తమను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్న తమకు కనీస వేతనం కింద రూ.26వేలు ఇవ్వడంతో పాటు ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి, పెన్షన్, ఈఎస్‌ఐ, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా రిటైర్డ్‌మెంట్ బెనిఫిట్స్ కింద టీచర్లకు రూ.10లక్షలు, హెల్పర్లకు రూ.5లక్షలు, వేతనంలో సగం పెన్షన్ నిర్ణయించాలని, ప్రమాద బీమా కింద రూ.5లక్షలు ఇవ్వాలని, అర్హత ఉన్న హెల్పర్లకు పదోన్నతులు కల్పించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ ప్రధాన కార్యదర్శి పుట్ట ఆంజనేయులు, ఉపాధ్యక్షుడు నిక్సన్, సహాయ కార్యదర్శి ఆర్ఎన్ రమేష్ అంగన్‌వాడీ టీచర్లు నారాయణమ్మ, రమాదేవి, సుగుణాబాయి, కృష్ణమ్మ, లక్ష్మీదేవి తదితరుల పాల్గొన్నారు.

చాకలి ఐలమ్మ పోరాటం స్ఫూర్తిదాయకం



మదనాపురంలో ఐలమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు



వనపర్తిలో..

వనపర్తి టౌన్: బందూకును చేతపట్టి భూస్వామ్య వ్యవస్థకు ఎదురు నిలవడంతో పాటు రజాకార్ల పాలనకు వ్యతిరేకంగా పోరాడిన గొప్ప పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ అని ప్రజావాగ్గేయకారుడు రాజారామ్‌ప్రకాశ్ అన్నారు. మంగళవారం చాకలి ఐలమ్మ జయంతిని పురస్కరించుకొని టీజేఏసీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కవి గిరిరాజాచారి, కౌన్సిలర్ నాగన్న యాదవ్, బండలయ్య, మండ్ల దేవన్న నాయుడు, గంధం నాగరాజు, పరమేశ్వరచారి, సత్యనారాయణ చారి, శివుడు, లింగన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూర్: ఐలమ్మ జయంతిని పురస్కరించుకుని మున్సిపాలిటీ, ఎంపీడీఓ, తహసీల్దార్ కార్యాలయాల్లో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రజక సంఘం ఆధ్వర్యంలో పట్టణ పుర వీధుల గుండా ర్యాలీ నిర్వహించి గాంధీచౌక్‌లో ఆమె చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో చైర్‌పర్సన్ గాయత్రి, వైస్‌చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, కమిషనర్ నాగరాజు, తహసీల్దార్ రాజు, ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, ఏపీఎం శ్రీనివాసులు, బాలరాజు, ప్రసాద్, రాములు, రమేష్, శ్రీను, ఆనంద్, తిరుపతి ఉన్నారు.

ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలోని బస్టాండు వద్ద వీరనారి చాకలి ఐలమ్మ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో రజక సంఘం మండల అధ్యక్షుడు కుంచారపు రవీందర్, కమ్మరి గోపి, కుంచారపు శ్రీను, శివకుమార్, రమేష్, ప్రసాద్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పాన్‌గల్: కేతేపల్లిలో చాకలి ఐలమ్మ విగ్రహానికి ఏఐసీసీ జాతీయ ఓబీసీ కోఆర్డినేటర్ డా.కేతూరి వెంకటేష్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఫరీద్ అహ్మద్, వంశీరెడ్డి, లక్ష్మణ్, పర్వతాలు ఉన్నారు.

కొత్తకోట: తెలంగాణ సాయుధ పోరాటంలో వీరవనిత చాకలి ఐలమ్మ పోరాట పటిమ నేటి సమాజానికి స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని రజకసంఘం నాయకులు అన్నారు. మంగళవారం చాకలి ఐలమ్మ జయంతిని పురస్కరించుకొని పట్టణ కేంద్రంలోని ఐలమ్మ విగ్రహానికి రజకసంఘం నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రజాకారులకు వ్యతిరేకంగా పోరాడిన చాకలి ఐలమ్మ ఉక్కు మహిళని కొనియాడారు. కార్యక్రమంలో వెంకటేష్, చంద్రయ్య, బాలరాజు, రవి, ఆర్మీ బాలస్వామి, బాలరాజు, లక్ష్మయ్య, మహేష్, అంజి, నాగరాజు, సుగుణమ్మ, మన్నెమ్మ, చిట్టి, లక్ష్మి ఉన్నారు.

మదనాపురం: మండల కేంద్రంలోని గ్రంథాలయంలో మండల ప్రజా సంఘం ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి జగదీష్, రజకసంఘం మండల అధ్యక్షుడు తిరుపతయ్య, బీసీసెల్ మండల అధ్యక్షుడు కురుమూర్తి, ప్రజా నాట్యమండలి జిల్లా కన్వీనర్ వెంకటేష్, రజక సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.